మక్కసాగు ఆశాజనకం

కాసులు కురిపిస్తున్న సీడ్ మొక్కజొన్న

- ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి
- విత్తన కంపెనీల ప్రోత్సాహంతో రైతులకు మేలు

రేగొండ: ఈ ఏడాది యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో తక్కువ వ్యవధిలోనే పంట చేతికొచ్చే మొక్కజొన్న రైతులకు కాసులు కురిపిస్తుంది. వానాకాలంలో సాగు చేసిన పత్తి అధిక వర్షాల వల్ల పంట దిగుబడి లేక నష్టపోయిన రైతులు పత్తిని తొలగించి డిసెంబర్ మొదటి వారం వరకు సీడ్ మొక్కజొన్న సాగు చేశారు. రైతులు ఆలోచనకు అనుగుణంగా ఈ ఏడాది మొక్కజొన్న పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది.

35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి

మండలంలో యాసంగిలో సాగు చేసిన సీడ్ మొక్కజొన్న కోతకు వచ్చింది. వారం రోజులుగా పక్క గ్రామాల నుంచి కూలీలను తెప్పించుకుని రైతులు మొక్కజొన్నను కోస్తున్నారు. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. 120 రోజులకే పంట చేతికిరావడంతో పాటు క్వింటా రూ.3200 పలుకుతుంది. విత్తన కంపెనీ వారు పండించిన పంటను తీసుకెళ్లి వారికి డబ్బులు చెల్లిస్తోంది. ఎకరానికి దాదాపు రూ.1.20 లక్షల ఆదాయం సమకూరుతుంది. పెట్టుబడి రూ.30 నుంచి రూ.40 వేల వరకు అవుతుండగా ఎకరానికి రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇలా తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం సమకూరే మొక్కజొన్న ఈ ఏడాది రైతులకు ఆర్థికంగా భరోసానిచ్చింది.



మొక్కజొన్న పైరులో కంకులు కోస్తున్న కూలీలు



తరలించేందుకు సిద్ధంగా ఉన్న మక్కలు

కంపెనీల ప్రోత్సహంతో పెరిగిన సాగు..

గతంలో వందల ఎకరాల్లో సాగయ్యే మొక్కజొన్న నేడు వేల సంఖ్యలోకి వెళ్లడానికి విత్తన కంపెనీల ప్రోత్సహమే కారణం. విత్తన కంపెనీలు తొలుత ఫీల్డ్ చూసి విత్తనాలు, పంట వేసిన తర్వాత ఎలాంటి చీడ పీడలు ఆశించినా పురుగు మందులు సరఫరా చేశారు. ఈ విధంగా సీడ్ కంపెనీలు రైతులకు సహకరిస్తుండటంతో రైతులు కూడా మొక్కజొన్న సాగుపై మక్కువ చూపించారు. సీడ్ మొక్కజొన్న కావడంతో కోసి సంచుల్లో నింపి ఉంచితే ట్రాక్టర్ లేదా లారీ ద్వారా సీడ్ కంపెనీలు తీసుకెళ్తున్నాయి. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కేవలం కూలీల ఖర్చు మాత్రమే రైతులు పెట్టుకోవాలి. మండలంలో అడ్వాంట, సింజెంటా, పయనీర్, బేయల్ వంటి రకాలను సాగు చేశారు. ముందుగా సాగు చేసిన మొక్కజొన్న కోత కోయ్యగా కాస్త ఆలస్యంగా వేసిన పంట వారం రోజుల్లో కోతకొస్తోంది.

నాలుగు ఎకరాల్లో సాగు చేశా..



నాలుగు ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగు చేశా. సీడ్ కంపెనీ వారు విత్తనాలు, పురుగు మందులు అందజేశారు. ఎకరానికి 35 క్వింటాళ్ల పైగానే దిగుబడి వచ్చింది. క్వింటా రూ.3200 పలికింది. మొక్కజొన్న కోసిన తర్వాత కంపెనీ వారే సీడ్ మొక్కజొన్నను తీసుకెళ్లారు.

– పల్లెబోయిన ఉపేందర్, రైతు

క్లుప్తంగా

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



చిట్యాల: నియోజకవర్గంలోని ప్రజలకు లంబాడ గిరిజన ఆరాధ్యదైవమైన సీత్లా భావాని అమ్మవారి ఆశీస్సులు కలిగి సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని అందుకుతండా గ్రామ శివారులో లంబాడ గిరిజనులు ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే ఆరాధ్య దైవమైన ఏడు విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, లంబాడ గిరిజన నాయకులు అజ్మీరా నందునాయక్, కారోబార్ సీతారాం నాయక్, పూజారి బానోత్ రాజు నాయక్, కల్యాణ్, రాజు నాయక్, జయంత్ కుమార్, సుమన్, నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్, ఏన్కపల్లి గ్రామాలకు చెందిన కందికొండ రాజ్‌కుమార్, జాగరి శివకుమార్ సెల్‌ఫోన్లు ఇటీవల పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ దార్వా ఫోన్లను గుర్తించి మంగళవారం ఎస్సై పవన్‌కుమార్ బాధితులకు అందజేశారు. దీంతో వారు పోలీసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మొగుళ్లపల్లి: మండలంలోని పోతుగల్లు పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బొమ్మ శంకర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

చిట్యాల: వివాహం కావడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని వెంచరామి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంచరామి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తోట లక్ష్మణ్(28) తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. కాగా అదే గ్రామానికి చెందిన చిన్నమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో తన కంటే చిన్న వాళ్లకు పెళ్లిలు అవుతున్నాయని తనకు కావడం లేదని ఈనెల 5న మద్యం తాగిన అనంతరం రాత్రి సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. మృతుడి చిన్నమ్మ కూతురు తోట లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రథయాత్రను విజయవంతం చేయండి

- డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్

చిట్యాల: డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టబోతున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో మా భూమి రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జాక్, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను ఈ నెల 14న ఆదిలాబాద్‌లో ప్రారంభం కానుందని అన్నారు. కావున భూపాలపల్లి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి వివిధ సంఘాల నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శీలపాక నాగరాజ్, మండల అధ్యక్షుడు పర్లపెల్లి కుమార్, పుల్ల అశోక్, నేరెళ్ల రమేశ్, మట్టెవాడ కుమార్, చిలుముల శశికుమార్, కృష్ణ, పాల్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బ్రాహ్మణపల్లిలో గ్రామసభ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులతో ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రచురించిన అంశంపై ప్రత్యేకంగా డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రకటన అంశాలు చదివి వినిపించారు. కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేసి ఆర్జీలను అందజేసినట్లు డీటీ తెలిపారు. ఎస్‌డీసీ కార్యాలయం డీటీ షఫీ, గంగాధర్, ఇరిగేషన్‌శాఖ ఏఈఈ భరత్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రాజబాపు, కార్యదర్శి సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు మహదేవపూర్‌లో గ్రామసభ

మహదేవపూర్ పంచాయతీ కార్యాలయంలో నేడు (బుధవారం) చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఎర్రచెరువు నుంచి మేయిన్, డిస్ట్రిబ్యూటరీ, మైనర్ కెనాల్స్ కింద భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు డిటి కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పంచాయతీలో మహదేవపూర్, కొత్తపేట రైతులతో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



డీటీ కృష్ణకు ఆర్జీలు అందజేస్తున్న రైతులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

కాటారం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని దేశ భవిష్యత్, దేశ నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ హెచ్‌ఎం ఉమారాణి ఉద్యోగ విరమణ పొందగా మంగళవారం ఉద్యోగ విరమణ సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఉమారాణి దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న గౌరవం మరే వృత్తిలో లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. డీఈఓ రాజేందర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి తిరుపతి, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డికి పీఆర్‌టీయూటిఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేలా చూడటంతో పాటు ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధానకార్యదర్శి తిరుపతి ఉన్నారు.



ఉమారాణి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సర్వార్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి

ములుగు రూరల్: పేదరిక నిర్మూలన, సమానత్వం కోసం ఉద్యమించి ప్రాణత్యాగం చేసిన సర్వార్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రాంచంద్రాపురంలో సర్వార్ వర్ధంతి సందర్భంగా సార్మక స్థూపం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడిత ప్రజల అభ్యున్నతికి పోరాడిన మహోన్నతవ్యక్తి అని కొనియాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి గుండబోయిన చంద్రయ్య, దొంతి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సాయిరెడ్డి, రాజన్న, చిన్నమల్లయ్య, వడ్లూరి వెంకన్న, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: అకాల వర్షాలకు పంటలు, ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండలంలోని మేడారం, మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామంలోని డ్యాగల కుమారస్వామి, గూల్ల సుధాకర్, తాడ్వాయి ఎర్రగడ్డ కాలనీలోని చీర్ల శ్రీనివాస్ ఇళ్లపై కప్పు రేకులు గాలిదుమారానికి కొట్టుపోవడంతో వారి కుటుంబాలను డీపీఓ దేవరాజు, ఎంపీడీఓ సుమనవాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబులతో కాంగ్రెస్ నాయకులు కలిసి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఏటూరునాగారం: మండల పరిధిలోని ఆకులవారి గణపురంలో మంగళవారం అకాల వర్షానికి కూలిన ఇళ్లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పంచాయతీ సిబ్బందితో మాట్లాడి ఇళ్లపై పడిన చెట్లను తొలగించారు. అనంతరం రఘు మాట్లాడుతూ.. అకాల వర్షంతో నష్టపోయిన ఇళ్లను రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహించాలని అన్నారు. అయూబ్, ఖలీల్‌ఖాన్, దేవేందర్ ఉన్నారు.

రాజ్యాంగం ఓ పవిత్రమైన గ్రంథం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: భారత రాజ్యాంగం ఓ పవిత్రమైన గ్రంథం అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముచినిపర్తి, చల్లగరిగ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కేవలం పుస్తకం కాదని అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ల ఆలోచనలతో కూడిన పవిత్ర గ్రంథం అని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు ముకిరాల మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, నాయకులు గడ్డం కొమురయ్య, కామిడి రత్నాకర్‌రెడ్డి, సుధాకర్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పాదయాత్ర

భూపాలపల్లి రూరల్: రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథమని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని 4, 23, 24, 25 వార్డులు రాజీవ్‌నగర్, కారల్ మార్క్స్‌కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. నాయకులు బుర్ర కొమురయ్య, పలువురు మాజీ కౌన్సిలర్లు, దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, శిరుప అనిల్, స్వామి, టీపీసీసీ సభ్యులు చల్లూరిమధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

రేగొండ: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మొట్టె కిరణ్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదంతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు జోరు సుదర్శన్, చిగురుమామిడి కుమారస్వామి, పత్తి ప్రభాకర్, వీరబ్రహ్మం, మధుసూదన్, శ్రీనివాస్, ప్రభాకర్, సంతోష్, రాజయ్య, సదానందం పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: పాదయాత్ర చేస్తున్న నాయకులు

సన్నబియ్యం పంపిణీ



సన్నబియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మంచినీళ్ల దుర్గయ్య, యూత్ నాయకులు నగేష్, వేమునూరి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

గోవిందరావుపేట: గాలివాన బీభత్సానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం తెలంగాణ రైతు సంఘం సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం వచ్చిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను వెంకట్‌రెడ్డి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వడగండ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో కోతకు వచ్చిన పంట దెబ్బతిందని అన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు, మామిడి తోటకు ఎకరాకు రూ.50 వేలు, ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు తీగల ఆదిరెడ్డి, సోమా మల్లారెడ్డి, చిట్టి బాబు, గుండు రామస్వామి రైతులు పాపిరెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- తహసీల్దార్ శ్రీనివాస్

వాజేడు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని వాజేడు, పేరూరు, ప్రగళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వాజేడు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాథరాజు, ఏఈఓలు జాఫర్, హరీష్, సంఘ సిబ్బంది, రైతులు ఉన్నారు.

వెంకటాపురం(కె): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉప్పేడు వీరాపురం, వెంకటాపురం, బర్లగూఎడం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన పంటను దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మిరాజయ్య, మండల వ్యవసాయ అధికారి నవీన్, పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పూర్ణ, ఏఈఓ శ్యామ్, తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోహన్‌రావు

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం ఆశ డే సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు పవన్, జ్యోతి, సిబ్బంది యాకలక్ష్మి, రామకృష్ణ ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



టేకుమట్ల: బరువు కొలుస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పలిమెల: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు



కాటారం: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ శ్రీలతరెడ్డి

టేకుమట్ల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ స్వరూప అన్నారు. మంగళవారం పోషణ్ పక్వాడాలో భాగంగా గర్భిణులు, పిల్లల ఎత్తు, బరువును కొలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. అంగన్‌వాడీలో అందజేస్తున్న బాలమృతం, కోడిగుడ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమ్య, స్వప్న, భాగ్యలక్ష్మీ, మౌనిక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: మండలంలోని పలిమెల, పంకెన, సర్వాయిపేట, నీలంపల్లి, దమ్మూరు, ముకునూరు గ్రామ పంచాయతీ పరిధిల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులు, మహిళలు, పిల్లలకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. పిల్లలు, మహిళల్లో ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని ప్రోత్సహించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం మహిళలతో పోషన్ పక్వాడ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, సుశీల, కృష్ణాబాయి, నిర్మల, ఎలంద్ర, ఆదిలక్ష్మి, ప్రమీల, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని అల్లీపూర్, ప్రతాపగిరి, నస్తూర్‌పల్లి, మేడిపల్లి, బయ్యారం, చిద్నెపల్లి, గుమ్మాళ్లపల్లి, పోతుల్వాయి, సుందరాజ్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషన్‌పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణుల బరువు, రెండేళ్ల లోపు పిల్లల పెరుగుదల పర్యావేక్షణపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలతరెడ్డి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

- మండల విద్యాధికారి రాజు

రేగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కొత్తపల్లిగోరి మండల విద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి, చెన్నాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ట్విన్నింగ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా చిన్నకోడేపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లోని ప్రతి పరికరం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ప్యానల్ బోర్డు ద్వారా జరిగే బోధనను, లైబ్రరీ నిర్వహణ, గణిత ల్యాబ్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మండల విద్యాధికారి రాజు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ చిన్నకోడేపాక ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, దామరంచపల్లి, చెన్నాపూర్ ప్రధానోపాధ్యాయులు సునీల్, లలిత, ఉపాధ్యాయులు రాములు, రాజేందర్, స్కూల్ కాంప్లెక్స్ సీఆర్పీ సహదేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291